సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం । 24 । జనవరి । 2025



ప్రమాదంతో చెట్టాపట్టాలు!

మహారాష్ట్రలో బుధవారం జరిగిన రైలు ప్రమాదంలో 12 మంది పట్టాలపై ప్రాణాలు కోల్పోయినా జనం ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించడం లేదు.


II లో



జోరుగా గొలుసుకొట్టు చోరీలు

జిల్లాలో వరుస చైన్ స్నాచింగ్ ఘటనలు చోటు చేసుకోవడంతో మహిళలు బంగారు నగలు ధరించి బయటకు రావాలంటే భయపడుతున్నారు.

డెల్టాలకు 9,745 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 9,745 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.15 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

జిల్లాలో 704 పోషణ వాటికలు



విజయకుమారి

దేవరపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆకుకూరలు, కూరగాయలు ఉచితంగా అందించడానికి సాక్షం కార్యక్రమం ద్వారా పోషణ వాటికలు ఏర్పాటు **చేశామని** జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి కె.**విజయకుమారి** తెలిపారు. దేవరపల్లిలో గురువా**రం ఆమె విలేకర్లతో** మాట్లాడారు. ఒక్కొక్కటి **రూ.10 వేల** చొప్పున జిల్లాలోని 704 అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషణ వాటికల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.70.44 లక్షలు విడుదల చేసిందని తెలిపారు. జిల్లాలో 1,554 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, సొంత భవనాలున్న 704 కేంద్రాల వద్ద పోషణ వాటికలు ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా 1,554 కేంద్రాల్లోని గర్భిణులకు, బాలింతలకు ఆకుకూరలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 1,554 కేంద్రాల పరిధిలో 93 వేల మంది పిల్లలున్నారన్నారు. జిల్లాలో మొత్తం 1.08 మంది గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఉన్నారని వివరించారు. 950 అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు ప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేసిందని ఆమె తెలిపారు. ఒక్కో అంగన్‌వాడీ కేంద్రం మరమ్మతులు, పెయింటింగ్‌కు రూ.9,500 చొప్పున మంజూరు చేసిందన్నారు. ఈ పనులను గ్రామ పంచాయతీలకు అప్పగించామని పీడీ విజయకుమారి చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన మట్టి మాఫియా

మట్టి ట్రాక్టర్లను అడ్డుకున్న వీఆర్వోపై దౌర్జన్యం

గోకవరం: మండలంలోని కామరాజుపేటలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. మట్టి ట్రాక్టర్లను అడ్డుకున్న వీఆర్వోపై మట్టి ట్రాక్టర్ డ్రైవర్లు దౌర్జన్యానికి దిగారు. స్థానికుల సమాచారం ప్రకారం.. గ్రామ శివారున పంట పొలాల నుంచి ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లతో మట్టిని వెలికితీసి సమీపంలోని లే అవుట్‌కు తరలిస్తున్నారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న స్థానిక వీఆర్వో ధర్మరాజు అక్కడకు చేరుకుని, మట్టి ట్రాక్టర్లను అడ్డుకున్నారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్లు వీఆర్వోపై దౌర్జన్యానికి దిగారు. అడ్డు తప్పుకోకపోతే ట్రాక్టర్‌తో ఢీకొట్టి వెళ్లిపోతామని బెదిరింపులకు దిగారు. వీఆర్వో ఒక్కరే ఉండటంతో వారు మట్టి ట్రాక్టర్లను తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సంఘటనపై తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్వో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో జేఈఈ మెయిన్ పరీక్షలు అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రాజీవ్‌గాంధీ విద్యా సంస్థల్లో జరిగిన పరీక్షలకు మొదటి షిఫ్ట్‌లో 886 మందికి 878 మంది హాజరయ్యారన్నారు. రెండో షిఫ్ట్‌లో 884 మందికి గాను 874 మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉందన్నారు.

ఆడపిల్లలు ఆణిముత్యాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రకాష్‌బాబు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆడపిల్లలు మన జాతి ఆణిముత్యాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు అన్నారు. లింగ ఎంపిక నిషేధ చట్టం-2003పై అంగన్‌వాడీ, స్కానింగ్ సెంటర్ల ప్రతినిధులకు స్థానిక వెంకటేశ్వర నగర్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇప్పటికీ, అజ్ఞానం, మూఢత్వంతో తల్లిదండ్రులు అబ్బాయి అయితే తమను కంటికి రెప్పలా చూసుకుంటాడని, తమ వద్దే ఉంటాడని భావిస్తున్నారన్నారు. ఈ రోజుల్లో అబ్బాయి అయినా అమ్మాయి అయినా ఒక్కటేనని, వారికి మంచి విద్యాబుద్ధులు నేర్పించి, ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. సమాజంలో ఇప్పటికీ ఆడపిల్లల పట్ల అనాదరణ ప్రబలంగానే ఉందని, పుట్టబోయేది ఆడ శిశువని తెలియగానే, కొన్ని సందర్భాల్లో గర్భస్రావానికి సిద్ధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు స్త్రీ భ్రూణ హత్యలు కూడా పెరుగుతూండటం, అత్యంత విచారకరమని అన్నారు. ఈ వివక్ష కారణంగా పలు రాష్ట్రాల్లో మహిళల సంఖ్య తగ్గిపోతూండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. వీటన్నింటినీ అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 1994లో ఒక చట్టం అమలులోకి తెచ్చిందని, దానినే 2003లో సమగ్ర సవరణలతో గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ లింగ ఎంపిక నిషేధ చట్టంగా రూపొందించారని ప్రకాష్‌బాబు వివరించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రసన్న మాట్లాడుతూ, లింగ ఎంపిక నిషేధం చట్టం గురించి విశదీకరించారు. ఈ చట్టాన్ని అతిక్రమించే వారికి విధించే శిక్షలు, జరిమానాల గురించి వివరించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, స్కానింగ్, ఇమేజ్ సెంటర్లు పాటించాల్సిన నిబంధనలు, పాటించకపోతే జరిగే పరిణామాల గురించి వివరించారు. సమావేశంలో లీగల్ కం ప్రొహిబిషన్ ఆఫీసర్ ఎస్.శ్రీగౌరి, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై ఎస్‌కే కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలకు ప్రైవేటు గండం

రోడ్డుపై వెళ్తున్న ఇతర వాహన చోదకుల గుండెలదిరిపడేలా మితిమీరిన వేగం.. ముందు వెళ్తున్న వాహనాలను రయ్‌రయ్ మంటూ అత్యంత ప్రమాదకరంగా తప్పించుకుంటూ దూసుకుపోవడం.. ఎదురుగా జంక్షన్లు వస్తున్నా ఏమాత్రం కానరాని వెరపు.. వీటన్నింటికీ తోడు కొంత మంది మద్యం తాగి మరీ స్టీరింగ్ తిప్పేస్తూండటం.. వెరసి ప్రైవేటు బస్సులు తరచుగా ప్రమాదాలకు గురవుతూ.. ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు తీసుకువస్తున్నాయి.

- **తరచుగా ప్రైవేట్ బస్సులకు ప్రమాదాలు**
- **అతివేగం.. ప్రయాణికుల భద్రతతో చెలగాటం**
- **మద్యం తాగి బస్సులు నడుపుతున్న డ్రైవర్లు**
- **తూతూమంత్రంగా తనిఖీలు**
- రెండు రోజుల్లో ముగ్గురి మృత్యువాత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఎక్కువ మంది రైళ్లు, ఆర్టీసీ తర్వాత ప్రైవేటు ట్రావెల్స్ బస్సులనే ఆశ్రయిస్తూంటారు. రాత్రి వేళ ప్రయాణించే వారికి అనువుగా స్లీపర్ కోచ్‌లు, ఇతర సౌకర్యాలు ఎక్కువగా ఉండటంతో కొన్ని వర్గాల ప్రజలు ప్రైవేటు బస్సులకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అయితే, అతి వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, అధికారుల తనిఖీల లేమి వంటి కారణాలతో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నాయి.

ఎందుకీ వేగం?

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల వేగానికి అంతే లేకుండా పోతోంది. దీనికి సమయం ఓ కారణం. చాలా బస్సులు ఎక్కువగా విశాఖపట్నం, కాకినాడ నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు మధ్య రాకపోకలు సాగిస్తున్నాయి. విశాఖపట్నంలో బయల్దేరే సమయంలో ప్రతి బస్సులో సీట్లు పూర్తిగా నిండే వరకూ వేచి చూస్తున్నారు. తర్వాత అన్ని బస్సులూ ఒకేసారి బయలుదేరడం.. దీనికి తోడు విశాఖ నగరంలో ట్రాఫిక్ రద్దీ కారణంగా షెడ్యూల్‌లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీనికితోడు జాతీయ రహదారికి ఆనుకున్న ప్రధాన ప్రాంతాల్లో వారి పాయింట్ల వద్ద ఆగి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. అక్కడి నుంచి తర్వాతి పాయింటుకు చేరుకోవాలి. ఈ నేపథ్యంలో ప్రైవేటు బస్సుల వేగానికి పగ్గాలే ఉండటం లేదు.

బస్సు వెళ్తే బెంబేలే..

ట్రావెల్స్ బస్సు పక్క నుంచి వెళ్తున్న సందర్భాల్లో దాని వేగానికి, హారన్ శబ్దానికి ఆ రహదారిపై వెళ్తున్న ఇతర వాహదారులు, పాదచారులు సైతం భయాందోళనకు గురవుతున్న పరిస్థితి. కొన్ని సందర్భాల్లో ద్విచక్ర వాహనదారులు భయంతో అదుపు తప్పి పడిపోయి, గాయపడుతున్న దాఖలాలు కూడా ఉన్నాయి.

సుశిక్షితులైన డ్రైవర్లేరీ!

ట్రావెల్ బస్సుల పెరుగుదలకు అనుగుణంగా సుశిక్షితులైన డ్రైవర్లు దొరకడం లేదు. అధిక హార్స్‌పవర్ కలిగిన ఆ బస్సులు నడపడానికి ప్రత్యేక శిక్షణ అవసరం. అలా శిక్షణ పొందిన డ్రైవర్లు అధిక జీతాలు డిమాండ్ చేస్తూండటంతో ట్రావెల్స్ యజమానులు తక్కువ జీతానికి వచ్చే సాధారణ డ్రైవర్లకే ఆ బస్సులను అప్పగిస్తూ, ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కొంతమంది డ్రైవర్లు దురలవాట్లకు బానిసలై, మద్యం, గుట్కా వంటివి సేవించి స్టీరింగ్ తిప్పుతూ, అతివేగంగా బస్సు నడుపుతూ ప్రమాదాలకు కారకులవుతున్నారు. ఆకస్మిక మలుపులు, ఇరుకు రహదా**రులు, డైవర్షన్ల వద్ద బస్సులను అదుపు చేయలేకపోతున్నారు. సాధారణంగా సాయంత్రం సమయంలో బయలుదేరే ఈ బస్సులలో ఇద్దరు డ్రైవర్లు ఉండాలి. కానీ, ఒక డ్రైవర్, ఒక క్లీనర్‌తో సరిపెట్టేస్తున్నారు.** రాత్రి సమయంలో మధ్యమధ్యన క్లీనరే బస్సులు నడుపుతున్న ఉదంతాలు కూడా ఉన్నాయి.

తనిఖీలు ముమ్మరం చేయాలి

ట్రావెల్స్ బస్సులు బయలుదేరుతున్న ప్రధాన పాయింట్ల వద్దనే అధికారులు తనిఖీలు చేస్తే ప్రమాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుంది. విశాఖ నగరాన్ని దాటుతున్నప్పుడు శివారు ప్రాంతాల్లో కచ్చితంగా బ్రీత్ అనలైజర్‌తో ఆయా బస్సుల డ్రైవర్లను, క్లీనర్లను తనిఖీ చేయాలి. మార్గం మధ్యలో కూడా ఇటువంటి పరీక్షలు చేయాలి. దీనివలన వారు ఎటువంటి మత్తు పదార్థాలు సేవించినా బయటపడే అవకాశం ఉంటుంది. తక్షణం ఆ బస్సులను నిలిపివేయించి మరో డ్రైవర్‌ను ఇచ్చి పంపేవరకూ బస్సును కదలనీయకుండా రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.



కావేరీ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రవాణా అధికారులు

ఇద్దరిని బలిగొన్న డ్రంక్ అండ్ డ్రైవ్

విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఇటీవల రాజమహేంద్రవరంలో ప్రయాణికులను ఎక్కించుకునేందుకు లాలాచెరువు నుంచి జైలు రోడ్డులో అతి వేగంగా వస్తూ.. ఆర్ట్స్ కళాశాల వద్ద ద్విచక్ర వాహనదారులను ఢీకొంది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ఒకరు, చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ మద్యం తాగి బస్సు నడిపినట్లు పోలీసు దర్యాప్తులో తేలింది.

అతి వేగంతో తాజా ఘటన

గామన్ వంతెన సమీపాన అగ్రహారం వద్ద బుధవారం రాత్రి కావేరీ ట్రావెల్స్ బస్సు బోల్తా పడటానికి మితిమీరిన వేగమే కారణమైంది. ఈ బస్సు విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్తోంది. బస్సును అతి వేగంగా నడుపుతున్న డ్రైవర్ గామన్ వంతెనపై రహదారికి మరమ్మతులు జరుగుతున్న విషయాన్ని దగ్గరకు వస్తేనే కానీ గుర్తించలేకపోయాడు. ఆకస్మాత్తుగా గమనించి కంగారు పడి బ్రేకు వేయడంతో అతివేగంగా ఉన్న ఆ బస్సు అదుపు తప్పింది. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడిని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, 25 మందికి పైగా గాయపడ్డారు.

జిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2024	16	7	16
2025 (ఈ నెలలో)	2	3	25

కొనసాగుతున్న చికిత్స

కావేరీ ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుల్లో ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గురువారం తెల్లవారుజామున కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. శ్రీకాకుళానికి చెందిన చెల్లూరి కోటేశ్వరరావు, తలియ ధనలక్ష్మి, రేణుకలను జీజీహెచ్‌లో చేర్చారు. అయితే, రేణుకను ఆమె కుటుంబ సభ్యులు స్థానిక కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు చికిత్స కొనసాగుతోంది.

తనిఖీలు చేస్తున్నాం



జాతీయ రహదారి మీదుగా నగరంలోకి బస్సులు వేగంగా ప్రయాణించకుండా తనిఖీలు చేస్తుంటాం. అప్పుడప్పుడు కొన్ని బస్సులు వేగంగా వస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. విశాఖ నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వెళ్లే బస్సులకు మార్గం మధ్యలో జాతీయ రహదారిపై రాత్రి వేళ తనిఖీలు చేసే అవకాశం తక్కువ. ప్రయాణికులు కూడా అసౌకర్యంగా భావిస్తారు. బస్సులు బయలుదేరే ముందే ఆ ట్రావెల్స్ నిర్వాహకులు డ్రైవర్లను తనిఖీ చేసి, పంపితే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చు. డ్రైవర్లు కూడా తాము నడిపే బస్సులో ఎన్నో కుటుంబాలు, జీవితాలు ఉన్నాయనే విషయాన్ని గుర్తించాలి. బస్సు ఎక్కిన ప్రయాణికుడు ఆ డ్రైవర్‌పై నమ్మకంతో ప్రశాంతంగా నిద్రించే పరిస్థితి కల్పించాలి.

– ఆర్.సురేష్, జిల్లా రవాణా శాఖ అధికారి, రాజమహేంద్రవరం

రోగ నిరోధక శక్తి పెంపుతో
టీబీ నుంచి విముక్తి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): బలవర్ధకమైన ఆహారంతో పాటు వ్యాయామం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, తద్వారా క్షయ వ్యాధి (టీబీ) నుంచి విముక్తి పొందవచ్చని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్రధానమంత్రి టీబీ విముక్తి భారత్ కార్యక్రమం స్ఫూర్తితో నిక్షయ్ మిత్ర హోదాలో ఆమె గురువారం ఒక బాలికను దత్తత తీసుకున్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, క్షయ వ్యాధిని జిల్లా నుంచి పారదోలేందుకు స్వచ్ఛందంగా నిక్షయ్ మిత్రలుగా పేర్లు నమోదు చేసుకుని, టీబీ బాధితులను దత్తత తీసుకుని, ప్రభుత్వం అందించే పోషణ పథకానికి చేయూతనివ్వవచ్చని తెలిపారు. దత్తత తీసుకున్న వారు ఒక్కో వ్యక్తికి నెలకు రూ.700 చొప్పున ఆరు నెలల పాటు రూ.4,200 ఆర్థిక సహాయం చేయాలని, ఈ మొత్తంతో టీబీ బాధితులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తామని చెప్పారు. టీబీ నిర్మూలనకు వ్యాపారవేత్తలు, అధికారులు, ప్రజలు ముందుకు రావాలని కలెక్టర్ ప్రశాంతి విజ్ఞప్తి చేశారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎన్.వసుంధర మాట్లాడుతూ, ఆర్థిక సహాయం అందించదలచిన వారు నిక్షయ్ మిత్ర అకౌంట్‌కు నేరుగా జమ చేయవచ్చని, లేదా కలెక్టరేట్‌లో సంప్రదించాలని కోరారు.



పౌష్టికాహార కిట్ అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

పోషణ వాటికలు భేష్

- జిల్లా కలెక్టర్ సంతృప్తి
- గర్భిణులకు ఆకుకూరల పంపిణీ
- అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

దేవరపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోషణ వాటికల నిర్వహణపై జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంతృప్తి వ్యక్తం చేశారు. వీటిని నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను అభినందించారు. దేవరపల్లి ఇందిరమ్మ కాలనీ, చిన్నాయగూడెం, యాదవోలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్, ఇంకుడు గుంతలు, పోషణ వాటికలను పరిశీలించి, గర్భిణులు, బాలింతలకు ఆకుకూరలు పంపిణీ చేశారు. దేవరపల్లి ఇందిరమ్మ కాలనీలో పోషణ వాటికను పరిశీలించిన కలెక్టర్ అంగన్‌వాడీ కార్యకర్త సత్యవతిని అభినందించారు. అక్కడ పెంచిన ఆరు రకాల ఆకుకూరల గురించి ఆమెను అడిగి తెలుసుకున్నారు. అన్నీ ఒకేసారి కాకుండా వారం వ్యవధిలో అందుబాటులోకి వచ్చేలా ఆకుకూరలు పెంచాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఐసీడీఎస్ అధికారులకు కలెక్టర్ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కేంద్రం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలోని 78 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లు, 173 కేంద్రాల వద్ద మరుగుదొడ్లు నిర్మించామని తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం వద్ద పోషణ వాటిక ఏర్పాటు చేసి, పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు సేంద్రియ పద్ధతిలో పండించిన ఆకుకూరలు, కూరగాయలు ఉచితంగా అందిస్తున్నామని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు, పెయింటింగ్, ప్రహరీల నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. యాదవోలులో ఉపాధి హామీ పథకం నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను కూడా కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి కె.విజయకుమారి, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బీవీ గిరి, డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వరరావు, డీఎల్‌డీఓ ఎ.శ్రీవారెడ్డి, ఈఓ పీఆర్‌డీ వై.రాజారావు, యాదవోలు సర్పంచ్ సున్నం వరప్రసాద్, పీఆర్ ఏఈ వినోద్, పంచాయతీ కార్యదర్శి ఎస్.రవికిషోర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయశాంతి, శశికళ తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లి ఇందిరమ్మ కాలనీలో గర్భిణులకు ఆకుకూరలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సమస్యలు పరిష్కరించండి సార్!

- దేవదాయ శాఖ కమిషనర్‌గా రామచంద్ర మోహన్
- గతంలో అన్నవరం దేవస్థానం ఈఓగా పని చేసిన అనుభవం
- ఇక్కడి సమస్యలపై దృష్టి పెట్టాలని సిబ్బంది ఆశాభావం



అన్నవరం: రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఆ శాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్ర మోహన్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో (ఎఫ్ఏసీ) నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఇన్‌చార్జి కార్యదర్శి, కమిషనర్‌గా పని చేసిన ఎస్.సత్యనారాయణను బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా బదిలీ చేసింది. రామచంద్ర మోహన్ గతంలో రెండు దఫాలు అన్నవరం దేవస్థానం ఈఓగా పని చేసిన విషయం విదితమే. ఇప్పుడు ఎఫ్ఏసీ కమిషనర్‌గా నియమితులవడంతో అన్నవరం దేవస్థానం సమస్యలపై ఆయన దృష్టి సారించాలని ఇక్కడి సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో వివిధ కార్యక్రమాలకు శ్రీకారం

అన్నవరం దేవస్థానం ఈఓగా పని చేసిన కాలంలో రామచంద్ర మోహన్ వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 2010–12 మధ్య దేవస్థానంలో రూ.15 కోట్లతో 135 గదుల హరిహర సదన్ సత్రం, 36 హాల్స్‌తో విష్ణు సదన్ వివాహ మండపాల భవనం నిర్మించారు. అలాగే, 2023–24 మధ్య ఈఓగా పని చేసినప్పుడు రూ.3 కోట్లతో ఒక మెగావాట్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఏటా కార్తిక పౌర్ణమి నాడు ఉదయం 7 గంటల నుంచి జరిగే సత్యదేవుని గిరి ప్రదక్షిణతో మధ్యాహ్నం వరకూ అన్నవరం మెయిన్ రోడ్డు, రత్నగిరి ఘాట్ రోడ్లపై ట్రాఫిక్ స్తంభించిపోయి భక్తులు చాలా ఇబ్బంది పడేవారు. గత ఏడాది కార్తిక పౌర్ణమి నాడు గిరి ప్రదక్షిణను మధ్యాహ్నం 2 గంటలకు మార్చి, ఎటువంటి ఇబ్బందీ లేకుండా నిర్వహించారు. గతంలో ఈఓగా పని చేసిన ఆయన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న దేవస్థానానికి కమిషనర్ హోదాలో సహాయ సహకారాలు అందిస్తారనే అభిప్రాయం సిబ్బందిలో వ్యక్తమవుతోంది.

నేతి కొనుగోళ్లపై దృష్టి సారించరూ..

తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి ఆరోపణల నేపథ్యంలో అన్ని దేవస్థానాల్లో టెండర్ ద్వారా నేతి కొనుగోళ్లు నిలిపివేశారు. సహకార డెయిరీల నుంచే కొనుగోలు చేస్తున్నారు. అన్నవరం దేవస్థానంలో తయారు చేసే గోధుమ నూక ప్రసాదంలో ఉపయోగించే ఆవు నెయ్యి కొనుగోలుకు ఏటా సుమారు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకూ దేవస్థానం ఖర్చు చేస్తోంది. ప్రస్తుతం సహకార డైరీల కొనుగోలు చేస్తున్న నేతికి ఇంకా ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తోంది. గతంలో కిలో నెయ్యి టెండర్ ద్వారా రూ.584కే కొనుగోలు చేశారు. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి నెయ్యి సరఫరాకు టెండర్ పిలవగా అతి తక్కువగా కిలోకి రూ.484కు దాఖలైంది. అయితే, ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఆ టెండర్‌ను కాదని సంగం డెయిరీ నుంచి కిలో రూ.590కి కొనుగోలు చేస్తున్నారు. ఇది టెండర్ ధరకంటే రూ.106 అధికం. ప్రతి నెలా 10 వేల కిలోల నుంచి 15 వేల కిలోల వరకూ కొనుగోలు చేస్తున్నారు. మూడు నెలలుగా ఈవిధంగా దాదాపు రూ.80 లక్షలు అధికంగా చెల్లించారు. ఈ నేపథ్యంలో నెయ్యి కొనుగోలుపై కమిషనర్ రామచంద్ర మోహన్ దృష్టి సారిస్తే దేవస్థానానికి మేలు జరుగుతుంది.

నిర్మాణాలకు నిధులేవీ!

దేవస్థానంలో రూ.90 లక్షలతో టోల్‌గేట్ నుంచి రత్నగిరికి రెండో మెట్ల దారి, రూ.20 కోట్లతో ఎస్ఆర్‌సీ సత్రం స్థలంలో 110 గదుల సత్రం, ఇంకా పశ్చిమ రాజగోపురం ముందు షెడ్డు నిర్మాణం వంటి పనులు కూడా ప్రారంభం కావాల్సి ఉంది. కానీ, అందుకు అవసరమైన నిధులు దేవస్థానం వద్ద లేని పరిస్థితి. దీని కోసం డిపాజిట్లు విత్‌డ్రా చేయాల్సి ఉంటుంది. దీనిపై కూడా రామచంద్ర మోహన్ ఇక్కడి అధికారులకు మార్గదర్శనం చేయాలని దేవస్థానం వర్గాలు ఆశిస్తున్నాయి.



మండపేట మండలం కేశవరం వద్ద రైల్వే గేటు వేసి ఉండగా చంటిబిడ్డతో గేటు దాటుతున్న మహిళ



సామర్లకోట స్టేషన్‌లో మూడో నంబర్ ప్లాట్‌ఫారంలో ఉన్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్ కోసం పట్టాలు దాటుతున్న ప్రయాణికులు



తుని రైల్వే స్టేషన్‌లో ఇలా..



నిడదవోలు రైల్వేస్టేషన్‌లో ఆదరాబాదరాగా..



రాజమహేంద్రవరంలో...

ప్రమాదంతో చెట్టాపట్టాలు!

మహారాష్ట్రలో బుధవారం జరిగిన రైలు ప్రమాదంలో 12 మంది పట్టాలపై ప్రాణాలు కోల్పోయినా జనం ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించడం లేదు. తొటివారికన్నా ముందుండాలని, సమయం కలిసొస్తుందని రైల్వే ఓవర్ బ్రిడ్జిలను ఉపయోగించకుండా పట్టాలను దాటేస్తున్నారు. రైల్వే అధికారులు చేసే హెచ్చరికలను, ఇచ్చే సూచనలను పెడచెవిన పెట్టి అయినవారిని దుఃఖసాగరంలో ముంచే ఈ కంగారు అవసరమా అన్నది అందరూ ఆలోచించాల్సిన విషయం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా గురువారం వివిధ స్టేషన్లలో ప్రయాణికులు ప్రాణాలు పణంగా పెట్టి ఇలా పట్టాలు దాటారు.

జోరుగా గొలుసుకొట్టు చోరీలు

- ఉమ్మడి జిల్లాలో పెరిగిన చైన్ స్నాచింగ్‌లు
- నగలు ధరించి బయటకు వెళ్లాలంటే భయపడుతున్న మహిళలు
- పోలీసులకు సవాల్ విసురుతున్న నేరస్తులు
- అదుపులో నలుగురు అనుమానితులు



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో దొంగలు మరోసారి పేట్రేగిపోయారు. బుధవారం ఒక్కరోజే ఆరుచోట్ల చైన్ స్నాచింగ్‌లు చోటు చేసుకోవడంతో మహిళలు బంగారు నగలు ధరించి బయటకు రావాలంటే భయపడుతున్నారు. గత ఏడాది చైన్ స్నాచింగ్ 22 కేసులు నమోదు కాగా ఈ ఏడాది ప్రారంభంలో ఒక్క నెలలోనే 7 కేసులు నమోదు కావడం గమనార్హం.

పుస్తెల తాళ్లు పక్కన పెడుతున్నారు

మహిళలు బంగారు నగలు ధరించడం హోదాగా భావిస్తారు. ఆలయాలకు, ఫంక్షన్లకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా నగలు ధరిస్తారు. అయితే జరుగుతున్న వరుస దొంగతనాలతో బంగారు నగలు ధరించడానికి భయపడుతున్నారు. బంగారు పుస్తెలతాడులు సైతం పక్కన పెట్టి పసుపు తాడుతో బయటకు వస్తున్నారు. జిల్లాలో ఈ పరిస్థితి నెలకొంది. జిల్లాతోపాటు ఉమ్మడి జిల్లాల్లోను ఇదే విధంగా తరచుగా దొంగతనాలు జరుగుతుండడం పోలీసులకు సవాల్‌గా మారింది.

పాత వారా.. కొత్త వారా?

జరుగుతున్న దొంగతనాలతో ఉమ్మడి జిల్లాలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైనా ఫలితం లేదు. నేరస్తులు హెల్మెట్ ధరించి ఈ చోరీలు చేస్తుండడం, పోలీసులకు చిక్కకుండా చాకచక్యంగా తప్పించుకుంటుండడంతో పాటు నేరం చేసిన వెంటనే క్షణాల్లో తప్పించుకుని వెళ్లిపోతున్నారంటే జిల్లాలోని వీధులు, రహదారులపై పూర్తి అవగాహన ఉండి ఉండాలి. జిల్లాలో నేరస్తులే ఈ చోరీలు చేస్తుండవచ్చని ఒక భావన. మరో పక్క అమలాపురం, కాకినాడ జిల్లాల్లోనూ ఇదే తరహా చోరీలు జరుగుతుండడంతో ఉమ్మడి జిల్లాపై పూర్తి పట్టు ఉన్న వేరే ముఠా ఏదైనా ఈ నేరాలకు పాల్పడుతోందా అని పోలీసులు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పాత నేరస్తులపై పూర్తి నిఘా

ఉమ్మడి జిల్లాలో గత పదేళ్లలో గొలుసు దొంగతనాలకు పాల్పడ్డ నేరస్తుల చిట్టాను ఇప్పటికే పోలీసులు బయటకు తీశారు. వారికి ఈ నేరాలతో ఏమైనా సంబంధం ఉందా, ప్రస్తుతం వారు ఎక్కడ ఉన్నారు, ఏం చేస్తున్నారు, వారు ఏ ఫోన్ వాడుతున్నారు, నేరం జరిగిన సమయంలో ఆ ఫోన్ ఎక్కడ పనిచేస్తోంది తదితర కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

నేరస్తులను త్వరగా పట్టుకోవాలి

గతంలో విజిబుల్ పోలీసింగ్ ఎక్కువగా ఉండేది. ఇటీవల కాలంలో అది తగ్గింది. ఇటీవల నగరానికి వచ్చిన డీజీపీ కూడా విజిబుల్ పోలీసింగ్ అవసరం లేదని, కేసుల పురోగతి, దర్యాప్తు విజిబుల్‌గా ఉండాలని అనడం గమనార్హం. ఈ విధానం సరైన విధానం కాదని ప్రజలు అనుకుంటున్నారు. రోడ్డు పైకి వచ్చినప్పుడు ఏదో మూల పోలీసు, పోలీసు వాహనం కనపడితే నేరం చేయడానికి వచ్చే నేరస్తుడు భయపడి ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకుంటాడు. విజిబుల్ పోలీసింగ్‌లో ఉన్న ఉపయోగం అది. మళ్లీ దాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. జరిగిన గొలుసు దొంగతనాలపై దర్యాప్తు ముమ్మరం చేసి నేరస్తులను త్వరితగతిన పట్టుకోవాలి. ప్రజల్లో ఉన్న అభద్రతా భావాన్ని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేరస్తులను పట్టుకుంటాం



గొలుసు చోరీలపై నిఘా పెట్టాం. జరుగుతున్న నేరాలు ఇక్కడి వారి పనా, వేరే రాష్ట్రం ముఠా చేసిందా అనేది దర్యాప్తులో తేలాల్సి వుంది. చోరీలు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేశాం. విజిబుల్ పోలీసింగ్ పెంచుతున్నాం. ఆలయాల వద్ద, ఫంక్షన్ హాళ్ల వద్ద మఫ్టీలో గస్తీని పెంచుతాం. మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసర సమయాల్లో మహిళలు 112 నంబరుకు ఫోన్ చేసి సహాయం పొందాలి. నేరం జరిగిన తర్వాత గగ్గోలు పెట్టడం కన్నా ముందే జాగ్రత్తలు తీసుకుంటే నేరానికి ఆస్కారం ఉండదు.

–డి.నరసింహకిశోర్, జిల్లా ఎస్పీ, తూర్పుగోదావరి జిల్లా

పోలీసుల అదుపులో చైన్ స్నాచింగ్ అనుమానితులు?

వరుస చైన్ స్నాచింగ్ చోరీల నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బుధవారం మరోసారి వరుస చోరీలు జరగడంతో బృందాలు అప్రమత్తమై నేరస్తుల కదలికలపై నిఘా పెట్టాయి. చోరీలతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న ఒక ముఠా రంపచోడవరం, సీలేరు మీదుగా ఒడిశా బోర్డర్‌లోకి ప్రవేశించినట్టు గుర్తించారు. నలుగురు అనుమానితులను బుధవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.

బాధితురాలికి ఊరట

స్పందించిన అధికారులు

సాక్షి ఇంపాక్ట్

నల్లజర్ల: అనంతపల్లిలో మూడు రోజులుగా గృహ నిర్బంధంలో ఉన్న మామిడి రూత్‌లక్ష్మికి ఊరట లభించింది. వృద్ధురాలు పడుతున్న ఇబ్బందులను వెల్లడిస్తూ 'ఇంటి నుంచి బయటకు వచ్చే దారేది' అంటూ 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన వార్తా కథనానికి కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత స్పందించారు. తక్షణం అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి తగు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దారు ఎస్.వి.నాయుడును ఆదేశించారు. ఈ మేరకు ఆర్ఐ వై.రాధాబాయి, వీఆర్వో సురేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, మహిళా సంరక్షణ కార్యదర్శులు కనక దుర్గ, సుస్మిత ప్రియాంక వృద్ధురాలు రూత్‌లక్ష్మిని కలసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎదురింటి యజమాని పాటంశెట్టి నాగేశ్వర రావు కుటుంబ సభ్యులతోను అధికారులు మాట్లాడారు. కోర్టు తీర్పు వచ్చే వరకు ఇంతవరకు ఏవిధంగా దారి వినియోగించారో అదే కొనసాగించాలని సూచించారు. ఇంటి గుమ్మం ముందు ముళ్లకంపలు వేసిన మిగతా ఇళ్లవారి వద్ద వివరాలు సేకరించారు. వృద్ధురాలిని ఇబ్బందులకు గురి చేయవద్దని, ఆర్డీఓ ఉత్తర్వులను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అనంతపల్లిలో గృహ నిర్బంధంలో ఉన్న వృద్ధురాలి ఇంటికి వెళ్లిన అధికారులు

బిందుశ్రీకి స్టార్ ఆఫ్ ఇండియా అవార్డు

యానాం: జాతీయ బాల్‌బాడ్మింటన్ పోటీల్లో టీమ్ విభాగంలో ద్వితీయ, డబుల్స్‌లో ప్రథమ స్థానం సాధించి స్టార్ ఆఫ్ ఇండియా అవార్డును నీలపల్లికి చెందిన ఇసుకపట్ల బిందుశ్రీ అందుకున్నారు. ఈ మేరకు తూర్పుగోదావరి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముప్పనస్వామి ప్రకటనలో తెలిపారు.

మారిన రైళ్ల వేళలు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్ల సమయాలను మారుస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ రైల్వే డివిజన్‌లో విజయవాడ తర్వాత రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌గా కొనసాగుతోంది. నిత్యం జిల్లా మీదుగా 110 రైళ్ల రాకపోకలు సాగిస్తుండగా సుమారు 50 వేల మంది ప్రయాణిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా రాజమహేంద్రవరంతోపాటు సామర్లకోట, కాకినాడ, తుని తదితర రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. అయితే తాజాగా రైళ్ల సమయం మార్పు జరగడంతో మారిన రైళ్ల రాకపోకల సమయాలను ప్రయాణికులు గుర్తించాలని రైల్వే అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మారిన సమయాలు ఇలా

రైలు నంబరు	రాజమహేంద్రవరం		సామర్లకోట	
	పాత టైమ్	మారిన టైమ్	పాత టైమ్	మారిన టైమ్
22834 భువనేశ్వర్	06.45	06.20	05.25	04.45
13352 అలెప్పీ ధనబాద్	08.20	07.35	09.15	08.25
12718 రత్నాచల్	08.35	07.58	09.15	08.50
17249 తిరుపతి– కాకినాడ	09.50	08.40	10.45	09.30
12515 సిల్చార్ ఎక్స్‌ప్రెస్	15.45	15.10	----	-----
22643 పాట్నా	15.45	15.10	----	-----
12509 గౌహతి	15.45	15.10	----	-----
12842 కోరమండల్	16.10	15.30	17.50	17.05
22842 శంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్	17.05	16.25	17.50	17.05
22808 శంత్రాగచ్చి ఏసీ	17.05	16.25	17.50	17.05
12659 గురుదేవ్	18.00	17.25	18.50	18.05
17482 తిరుపతి-బిలాస్‌పూర్	22.25	21.40	23.10	22.20
17480 తిరుపతి– పూరి	22.25	21.40	23.10	22.20
12845 భువనేశ్వర్	17.20	16.40	16.30	16.00
18047 వాస్కో	15.35	16.05	-----	-----
17488 తిరుమల	17.40	17.05	01.05	12.30
17220 విశాఖ-మచిలీపట్నం	02.00	01.10	01.05	12.30
12755 భావనగర్	06.40	06.35	----	(హాల్ట్ లేదు)
17206 షిర్డీ ఎక్స్‌ప్రెస్	07.15	06.05	06.25	05.30
12737 గౌతమీ	20.20	20.20	19.40	19.40
12775 కోకనాడ	21.00	21.00	----	(హాల్ట్ లేదు)

అంబాజీపేట కొబ్బరి మార్కెట్




కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,500 – 16,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

నిడదవోలు : పట్టణంలో చినకాశిరేవు వద్ద గురువారం రైల్వేట్రాక్ దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వృద్ధురాలిని రైలు ఢీకొంది. ఈ ఘటనలో సుమారు 60 ఏళ్ల ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురీ గదిలో భద్రపరిచారు. మృతురాలు ఎరుపు, తెలుపు డిజైన్‌తో ఉన్న పింక్ రంగు చీర, పింక్ రంగు జాకెట్ ధరించి ఉంది. తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్సై అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 94906 17090 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై అప్పారావు కోరారు.

ఆదిత్య విద్యార్థుల వినూత్న ప్రయత్నం



జేఎన్‌టీయూకేలో ఆదిత్య నిర్వహించిన హ్యాండ్‌రైటింగ్ మారథాన్



హ్యాండ్‌రైటింగ్ మారథాన్‌లో పాల్గొన్న జేఎన్‌టీయూకే వీసీ మురళీకృష్ణకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించడానికి కాకినాడ ఆదిత్య విద్యార్థులు వినూత్న ప్రయత్నం చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి, జాతీయ చేతి రాత దినోత్సవం సందర్భంగా జేఎన్‌టీయూకేలో గురువారం దాదాపు 2,200 మంది విద్యార్థులతో హ్యాండ్ రైటింగ్ మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య గ్రూప్ చైర్మన్ శేషారెడ్డి మాట్లాడుతూ నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జీవిత చరిత్ర ఆదిత్య విద్యార్థులతో కలిసి రాయడమనేది చాలా గొప్పవిషయమన్నారు. ఆరు సంవత్సరాలుగా తమ విద్యార్థులు హ్యాండ్‌రైటింగ్ శిక్షణ పొందుతూ నైపుణ్యాన్ని కైవసం చేసుకున్నారన్నారు. ఈ నైపుణ్యంతో ఈసారి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులలో చోటు పొందేందుకు వినూత్న ప్రయత్నం చేశారన్నారు. జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమానికి తమ వర్సిటీ వేదిక అవ్వడం సంతోషంగా ఉందన్నారు. మూడవ అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి, స్కూల్ డైరెక్టర్ శృతిరెడ్డి, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఎగ్జిక్యూటివ్ శ్రీదిలీప్‌పాత్రో, సద్గురు అకాడమి చైర్మన్ మహాలక్ష్మి, సింగర్ కొండేపూడి యసశ్వి, విద్యార్థులు పాల్గొన్నారు.



● ఇంగ్లీష్ ఇడియమ్స్

లెట్ ది డస్ట్ సెటిల్

ఒక సంక్షోభం తరువాత లేదా గందర గోళం తరువాత వచ్చే సమయం కోసం ఎదురుచూసే సందర్భంలో వాడే మాట...లెట్ ది డస్ట్ సెటిల్.

ఉదా: ది కంపెనీ ఈజ్ ఫేసింగ్ క్రిటిసిజమ్ నౌ, బట్ దే ఆర్ వెయిటింగ్ టు లెట్ ది డస్ట్ సెటిల్ బిఫోర్ మేకింగ్ ఏ స్టేట్‌మెంట్

● మ్యూజిక్ వరల్డ్

మదిని దోచేలా మైమరచి పోయేలా!



అమెరికన్ సింగర్–సాంగ్ రైటర్ గ్రేసీ అబ్రామ్స్ రాసిన పాట 'దట్ ఈజ్ సో ట్రూ' బిల్‌బోర్డ్ జాబితాలో అగ్ర స్థానంలో ఉంది. ఇది గ్రేసీ రెండవ ఆల్బమ్. అమెరికాకు వెలుపల ఆస్ట్రేలియా, బెల్జియం, న్యూజీలాండ్, నార్వే, యూనైటెడ్ కింగ్ డమ్, ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, నెదర్లాండ్స్, స్వీడన్, స్విట్జర్లాండ్‌లో మ్యూజిక్ చార్ట్‌లలో అగ్ర స్థానంలో నిలిచింది. 'ఐ కుడ్ గో అండ్ రీడ్ యువర్ మైండ్' అని హుషారెత్తిస్తోంది. ఆ సందడిలో మీరు భాగం కావాలంటే....'దట్ ఈజ్ సో ట్రూ' ఒక్కసారి వినేయండి. 'షీ ఈజ్ సో కూల్' అంటూ గ్రేసీతో గొంతు కలపండి.

● గేమింగ్

స్పైడర్–మ్యాన్ మరోసారి...

గ్రేట్ సూపర్ హీరోలా సాహసాలు ఎప్పుడూ సూపర్‌గానే ఉంటాయి. దీనికి ఉదాహరణ... స్పైడర్–మ్యాన్!

ఒక్క ముక్కలో చెప్పాలంటే స్పైడర్–మ్యాన్ గేమ్స్ ఎన్నో సాహసాలకు కేరాఫ్ అడ్రస్. 'మార్వెల్స్ స్పైడర్–మ్యాన్ 2' యాక్షన్ అడ్వెంచర్ గేమ్. మార్వెల్ కామిక్స్ క్యారెక్టర్ 'స్పైడర్–మ్యాన్' ఆధారంగా రూపొందించిన గేమ్ ఇది. థర్డ్ పర్సన్ పర్‌స్పెక్టివ్ నుంచి ఆడే ఈ గేమ్‌లో పీటర్ పార్కర్, మైకేల్ మోరేల్స్ ప్రధాన పాత్రలు. న్యూయార్క్ కేంద్రంగా సాగే ఈ ఆటలో ప్లేయర్స్ రకరకాల స్పైడర్–మ్యాన్ సూట్‌లను సేకరించవచ్చు.

సమస్త సాహసాలతో గేమింగ్ కమ్యూనిటీని ఆకట్టుకునే 'మార్వెల్స్ స్పైడర్–మ్యాన్' ఈ నెల చివర రానుంది.



సిరీస్: మార్వెల్స్ స్పైడర్–మ్యాన్
ప్లాట్‌ఫామ్స్: విండోస్
జానర్: యాక్షన్–అడ్వెంచర్
మోడ్: సింగిల్–ప్లేయర్

● రికార్డ్



ప్రయాణ ప్రేమికుడు, ప్రఖ్యాత పర్వతారోహకుడు సర్ మార్టిన్ కాన్వే 'అధిరోహించిన ప్రతి శిఖరం ఏదో ఒకటి నేర్పుతుంది' అంటారు. అలా చిన్న వయసులోనే ఎన్నో శిఖరాల ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకుంది విశాఖపట్నానికి చెందిన కామ్య కార్తికేయన్. పదహారేళ్లకే ఎవరెస్ట్ అధిరోహించి రికార్డ్ సృష్టించింది. తాజాగా అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ని అధిరోహించి సెవెన్ సమ్మిట్స్ పూర్తి చేసిన యంగెస్ట్ ఫిమేల్‌గా రికార్డు సృష్టించింది....

కామ్య... అఖండ ఖ్యాతి

ఇలా మొదలైంది...

కార్తికేయన్, లావణ్య దంపతులకు సాహస యాత్రలు ఇష్టం. తమ చిన్నారి కామ్యను భుజాలపై మోసుకుంటూనే ట్రెక్కింగ్‌కు వెళుతుండేవారు. అలా పర్వత శిఖరాలతో చిన్నవయసులోనే కామ్యకు పరిచయం అయింది. మూడేళ్ల వయసులోనే ముంబైలోని లోనావాలాలో తండ్రితో పాటు ట్రెక్కింగ్‌లో పాల్గొని 'శభాష్' అనిపించుకుంది. మహారాష్ట్రలోని డ్యూక్స్ నోస్, రాజ్‌గడ్ పర్వతాల్ని నాలుగేళ్ల వయసులో తల్లిదండ్రులతో పాటు అధిరోహించింది.

తల్లికి తగిన తనయ...

హిమాలయాల ట్రెక్కింగ్‌కు తల్లితో పాటు వెళ్లింది కామ్య. అప్పుడు ఆమె వయసు ఏడేళ్లు. తల్లీ కూతుళ్లు మొదటి ప్రయత్నంలోనే 12 వేల అడుగుల ఎత్తైన చంద్రశీల పర్వతారోహణ చేశారు. ఆ తర్వాత హిమాలయ పర్వత శ్రేణుల్లో ఒకటైన 13,500 అడుగుల ఎత్తైన హర్‌కిదమ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. అది పూర్తి చేసిన కొద్ది రోజుల్లోనే 13,500 అడుగుల ఎత్తైన కేదార్‌కంఠ పర్వతారోహణ చేశారు.

తొమ్మిదేళ్ల వయసులో హిమాలయాల్లో రూప్‌కుండ్ ట్రెక్కింగ్ చేసి రికార్డు సృష్టించింది కామ్య.

ప్రధాని మన్ కీ బాత్‌లో కామ్య...

'అవరోధాల్ని అధిగమించి మన ఖ్యాతిని ఖండాంతరాల్లో ఇనుమడింపజేయాలి అనుకునేవారికి విశాఖ నగరానికి చెందిన కామ్య కార్తికేయన్ అనే చిన్నారి స్ఫూర్తినిచ్చింది' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ కామ్యను ప్రశంసించారు. దక్షిణ అమెరికాలోని అత్యంత ఎత్తైన అకాన్కాగువా పర్వతాన్ని అధిరోహించిన సమయంలో మన్‌కీ బాత్‌లో కామ్య ప్రస్తావన తీసుకువచ్చారు మోదీ.

– కరుకోల గోపీకిశోర్‌రాజా, సాక్షి, విశాఖపట్నం

ఆల్ రౌండర్

ముంబై నేవీ స్కూల్‌లో ప్లస్‌టు చదువుతున్న కామ్య కార్తికేయన్ పర్వతారోహణలోనే కాదు చదువులోనూ ప్రతిభ కనబరుస్తోంది. ప్రతి పరీక్షలోనూ ఫస్ట్ గ్రేడ్ సాధిస్తోంది. సంగీతంలోనూ ప్రావీణ్యం పొందిన కామ్య పియానో వాయిద్యానికి సంబంధించి 3 గ్రేడులు పాసైంది. కర్ణాటక సంగీతం, భరతనాట్యంలోనూ 'ఆహా' అనిపించేలా ప్రతిభ చూపుతోంది.

ఏడు ఖండాల్లో ఎన్ని రికార్డ్‌లో!

● దక్షిణ అమెరికాలో 22,837 అడుగుల ఎత్తైన మౌంట్ అకాన్‌కాగువాని అధిరోహించి ఈ శిఖరాన్ని అధిరోహించిన తొలి బాలికగా ప్రపంచ రికార్డు సృష్టించింది ● ఆఫ్రికా ఖండంలో అత్యంత ఎత్తైన 18,652 అడుగుల మౌంట్ కిలిమంజారోపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించి ఈ శిఖర యాత్ర పూర్తి చేయించడం ద్వారా ఆసియాలోనే అతి పిన్న వయస్కురాలిగా రికార్డు ● యూరప్ ఖండంలోని అత్యంత ఎత్తైన 18,510 అడుగుల మౌంట్ ఎల్‌బ్రస్‌ని అధిరోహించి యంగెస్ట్ గర్ల్ ఇన్‌ది వరల్డ్‌గా రికార్డు ● ఆస్ట్రేలియా ఖండంలోని అతి ఎత్తైన మౌంట్ కాజియాస్కోని అధిరోహించిన రెండో బాలికగా రికార్డు ● ఉత్తర అమెరికాలోని 20,308 అడుగుల మౌంట్ డెనలీని అధిరోహించిన యంగెస్ట్ నాన్ అమెరికన్‌గా రికార్డు ● ఆసియా ఖండంలో అత్యంత ఎత్తైన 29,031 అడుగుల మౌంట్ ఎవరెస్ట్‌ని అధిరోహించి నేపాల్ వైపు నుంచి ఎవరెస్ట్‌ని అధిరోహించి ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలిగా, తాజాగా అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ని అధిరోహించి, ప్రపంచంలోనే అతి పిన్నవయస్కురాలిగా రికార్డ్ సృష్టించింది.

ప్రతి అడుగూ సవాల్‌గా స్వీకరించాను

సెవెన్ సమ్మిట్స్ పూర్తి చేసి భారత త్రివర్ణపతాకాన్ని ఏడు ఖండాల్లోనూ రెపరెపలాడించాలన్నదే అమ్మా నాన్నల కల. వారి ఆకాంక్ష నెరవేర్చినందుకు గర్వంగా ఉంది. ఒకానొక సమయంలో మా పేరెంట్స్ తమ సంపాదనంతా నా మీదే ఖర్చు చేశారు. కొందరు దాతలు సహకారం అందించి నన్ను ముందుకు నడిపించారు. ఎంతటి కష్టాన్నైనా అవలీలగా ఎదుర్కోవాలన్నది నాన్న దగ్గర నేర్చుకున్నాను.

– కామ్య కార్తికేయన్

యువర్స్

● టెక్.. టాక్

ఇన్‌స్టాలో ఎడిట్ యాప్



స్మార్ట్‌ఫోన్‌లలో షార్ట్ వీడియో క్రియేషన్ సరికొత్త స్థాయికి చేరుకుంది. క్రియేటర్స్‌కు దగ్గరైన ప్లాట్‌ఫామ్‌లలో ఇన్‌స్టాగ్రామ్ ఒకటి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఐఫోన్‌ల కోసం 'ఎడిట్' యాప్‌ను ప్రకటించింది ఇన్‌స్టా.

'అధిక నాణ్యతతో వీడియోను రికార్డ్ చేయడానికి, మీరు కోరుకునే అన్ని ఎడిటింగ్ సాధనాలు, ఫ్రెండ్స్‌తో పాటు ఇతర క్రియేటర్‌లతో డ్రాఫ్ట్‌ను షేర్ చేసే సామర్థ్యం ఎడిట్‌లో ఉంటాయి. ఎడిట్ అనేది క్రియేటివ్ టూల్స్ సమాహారం' అని ప్రకటించాడు ఇన్‌స్టాగ్రామ్ హెడ్ ఆడమ్ మొస్సేరి.

'ఎడిట్స్' యాప్‌ను ఉపయోగించడం వల్ల యూజర్‌లు వాటర్ మార్క్ లేకుండా వీడియోలను ఎక్స్‌పోర్ట్ చేయడానికి, వీడియోల పనితీరును విశ్లేషించడానికి...మొదలైన వాటికి ఉపయోగపడుతుంది. ఈ యాప్ 2కె రిజల్యూషన్ నుంచి 60 ఎఫ్‌పిఎస్ వరకు హెచ్‌డీఆర్, ఎస్‌డీఆర్ ఫార్మట్‌లో ఎడిటింగ్ వీడియోలను సపోర్ట్ చేస్తుంది.

ఇక మూడు నిమిషాలు!



యూట్యూబ్ షార్ట్స్ మాదిరిగానే మూడు నిమిషాల నిడివి గల వీడియోలను ప్లాట్‌ఫామ్‌లో అప్లోడ్ చేయవచ్చని తెలియజేసింది ఇన్‌స్టాగ్రామ్. గతంలో 90 సెకన్ల వరకు వీడియోలను అప్లోడ్ చేసే అవకాశం కల్పించింది ఇన్‌స్టాగ్రామ్.

'ఇక నుంచి మీరు మూడు నిమిషాల నిడివి గల రీల్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. ఇన్‌స్టాగ్రామ్‌లో లాంగ్–ఫామ్ వీడియోలపై కాకుండా షార్ట్–ఫామ్ వీడియోలపై దృష్టి పెట్టాలనుకున్నాం. కానీ 90 సెకనులు చాలా తక్కువ సమయం అని క్రియేటర్‌ల నుంచి ఫీడ్‌బ్యాక్ వచ్చింది. పెంచిన సమయం వల్ల మీరు మరిన్ని స్టోరీలను షేర్ చేయవచ్చు' అని ఇన్‌స్టాగ్రామ్ ప్రకటించింది.



ఏసర్ స్విఫ్ట్ జో 14

స్క్రీన్ సైజ్: 14 అంగుళాలు
స్క్రీన్ రిజల్యూషన్: 2880×1800 పిక్సెల్స్
డైమెన్షన్స్: 312.9×217.9×14.9 ఎంఎం
బరువు: 1.25 కేజీ

ఓపెన్ ఏఐ టాస్క్స్



'టాస్క్స్' అనే న్యూ చాట్‌జీపీటి కేపబిలిటీతో ముందుకురానుంది ఓపెన్ ఏఐ. ప్రస్తుతం ఇది బీటా దశలో ఉంది. అలారం సెట్ చేయడం, ప్రజెంటేషన్ ఇవ్వడానికి అవసరమైన రాబోయే సమావేశాన్ని గుర్తు చేయడంలాంటి పనులను చేయగలదు. నీరు తాగడం నుంచి గ్రాసరీ షాపింగ్ వరకు ఎన్నో విషయాలలో 'టాస్క్స్' ద్వారా రిమైండర్స్ సెట్ చేసుకోవచ్చు.

సాక్షి సినిమా

హిట్ కాదు... ట్రిపుల్ బ్లాక్ బస్టర్

– వెంకటేశ్



● భీమ్స్, వెంకటేశ్, అనిల్ రావిపూడి

''సంక్రాంతి పండగకి నిజాయతీగా ఓ ఫ్యామిలీ సినిమా ఇవ్వాలనుకున్నాం. ప్రేక్షకులు మా ప్రయత్నాన్ని ఆదరించారు. హిట్ కాదు... ట్రిపుల్ బ్లాక్ బస్టర్ అంటున్నారు. మా సినిమాకి ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని హీరో వెంకటేశ్ అన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలైంది. గురువారం చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ– ''అనిల్‌తో నేనో ఫ్రెండ్‌లానే ఉంటాను. మేము చాలా ఎంజాయ్ చేస్తూ వర్క్ చేస్తాం.. అందుకే రిజల్ట్ ఇంత పాజిటివ్‌గా ఉంటుంది. ఇక నా సినిమా ఇన్ని కోట్లు వసూలు చేయాలని నేనెప్పుడూ అడగను.... వచ్చింది తీసుకోవాలి. ఇప్పటికే మా సినిమా రూ. 230 కోట్లు వసూలు చేయడం అనేది బోనస్.. ఇంతకంటే ఏం కావాలి'' అన్నారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ–''సినిమాకి కాస్త దూరమైన ప్రేక్షకులు కూడా మా 'సంక్రాంతికి వస్తున్నాం' కోసం థియేటర్‌కి రావడం ఆనందంగా ఉంది. రెవెన్యూ సైడ్ కూడా మేం ఊహించినదానికంటే అద్భుతంగా రావడం హ్యాపీ'' అని చెప్పారు. ''వెంకటేశ్‌గారి 'కలిసుందాం రా' సినిమా పాటలని ప్రేక్షకులు ఎంత గుండెల్లో పెట్టుకున్నారో... 'సంక్రాంతికి వస్తున్నాం' సాంగ్స్‌ని కూడా అదే స్థాయిలో ఆస్వాదించడం సంతోషంగా ఉంది'' అని సంగీత దర్శకుడు భీమ్స్ అన్నారు.

లైలాగా రెడీ కావడానికి రెండు గంటలు పట్టేది

– విశ్వక్ సేన్



● సాహు గారపాటి, విశ్వక్ సేన్, రామ్ నారాయణ్

''నా కెరీర్‌లో యాక్షన్ టచ్‌తో రూపొందిన ఔట్ అండ్ ఔట్ కామెడీ ఫ్యామిలీ ఫిల్మ్ 'లైలా'. చాలా క్లీన్‌గా ఉంటుంది. ప్రేక్షకులంతా ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమా కోసం లైలాగా రెడీ కావడానికి రెండు గంటలు పట్టేది. నిజంగా అమ్మాయిలకు హ్యాట్సాఫ్ చెప్పాలి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో విశ్వక్ సేన్, ఆకాంక్షా శర్మ జంటగా నటించిన చిత్రం 'లైలా'. సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది. లియోన్ జేమ్స్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'ఇచ్చుకుందాం బేబీ...' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. పూర్ణాచారి సాహిత్యం అందించిన ఈ పాటని ఆదిత్య ఆర్కే, ఎంఎం మానసి ఆలపించారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''లైలా'లో మోడల్ సోనూ, లైలా అనే రెండు పాత్రల్లో నటించా'' అన్నారు. ''లైలా' కథ ఇద్దరు ముగ్గురు హీరోలకు చెప్పాను. లేడీ గెటప్ వేయడం అంత ఈజీ కాదు. సినిమా అంటే పిచ్చి ఉంటేనే చేయగలరు. అలాంటి పిచ్చి ఉన్న విశ్వక్ దొరికారు'' అని రామ్ నారాయణ్ చెప్పారు. ''ఈ పాత్ర విశ్వక్ కెరీర్‌లో నిలిచిపోతుంది'' అన్నారు సాహు గారపాటి. పాటల రచయిత పూర్ణాచారి మాట్లాడారు.



● సాయిపల్లవి, నాగచైతన్య

హైలెస్సో హైలెస్సా

'హైలెస్సో హైలెస్సా...' అంటూ ఆడి పాడేస్తున్నారు నాగచైతన్య, సాయిపల్లవి. చందు మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య, సాయి పల్లవి జోడీగా నటించిన చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 7న విడుదల కానుంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'హైలెస్సో హైలెస్సా... నీవైపే తెరచాపని తిప్పేసా...' అంటూ సాగే మూడో పాటని గురువారం రిలీజ్ చేశారు. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటని శ్రేయా ఘోషల్, నకాష్ అజీజ్ పాడారు. ''మోస్ట్ ఎవైటెడ్ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'తండేల్'. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన 'బుజ్జి తల్లి..', 'నమో నమః శివాయ...' పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. వండర్‌ఫుల్ మెలోడీస్‌ని కంపోజ్ చేయడంలో మాస్టర్ అయిన దేవిశ్రీ ప్రసాద్ తాజాగా 'హైలెస్సో హైలెస్సా..' అంటూ సాగే మరొక లవ్ మెలోడీని కంపోజ్ చేశారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ఉత్తమ చిత్రం: అనోరా, ది బ్రూటలిస్ట్, ఎ కంప్లీట్ అన్‌నోన్, కాన్‌క్లేవ్, డ్యూన్: పార్ట్ 2, ఎమిలియా పెరెజ్, ఐయామ్ స్టిల్ హియర్, నికెల్ బాయ్స్, ది సబ్‌స్టాన్స్, విక్డ్ ● **ఉత్తమ దర్శకుడు:** సీన్ బేకర్ (అనోరా), బ్రాడీ కార్బెట్ (ది బ్రూటలిస్ట్), జేమ్స్ మ్యాన్‌గోల్డ్ (ది కంప్లీట్ అన్‌నోన్), జాక్వెస్ ఆడియార్డ్ (ఎమిలియా పెరెజ్), కోరలీ ఫార్గేట్ (ది సబ్‌స్టాన్స్) ● **ఉత్తమ నటుడు:** అడ్రియాన్ బ్రాడీ (ది బ్రూటలిస్ట్), తిమోతీ చాలమెట్ (ది కంప్లీట్ అన్‌నోన్), కోల్‌మెన్ డొమినింగో (సింగ్‌సింగ్), రే ఫియన్నెస్ (కాన్‌క్లేవ్), సెబస్టియన్ స్టాన్ (ది అప్రెంటిస్) ● **ఉత్తమ నటి:** సింథియా ఎరివో (విక్డ్), కార్లా సోఫియా గాస్కన్ (ఎమిలియా పెరెజ్), మికే మాడిసన్ (అనోరా), డెమి మూర్ (ది సబ్‌స్టాన్స్), ఫెర్నాండా టోర్రెస్ (ఐ యామ్ స్టిల్ హియర్) ● **ఉత్తమ సహాయ నటుడు:** యురా బోరిసోవ్ (అనోరా), కిరెన్ కల్కిన్ (ది రియల్ పెయిన్), ఎడ్వర్డ్ నార్టన్ (ది కంప్లీట్ అన్‌నోన్), గాయ్ పియర్స్ (ది బ్రూటలిస్ట్), జెరెమీ స్ట్రాంగ్ (ది అప్రెంటిస్) ● **ఉత్తమ సహాయ నటి:** మోనికా బార్బరో (ది కంప్లీట్ అన్‌నోన్), అరియానా గ్రాండే (విక్డ్), ఫెలిసిటీ జోన్స్ (ది బ్రూటలిస్ట్), ఇసబెల్లా రోస్సెల్లిని (కాన్‌క్లేవ్), జోయా సాల్దానా (ఎమిలియా పెరెజ్).




● కార్లా సోఫియా గ్లాస్కాన్

97వ ఆస్కార్ అవార్డ్ నామినేషన్స్ ప్రకటన

ఆస్కార్ సంబరం ఆరంభం






● 13 నామినేషన్లతో నాన్ ఇంగ్లిష్ మూవీ 'ఎమిలియా పెరెజ్' రికార్డ్ ● 'ది బ్రూటలిస్ట్, విక్డ్' చిత్రాలకు 10 నామినేషన్స్ ● ట్రాన్స్‌జెండర్‌కి దక్కిన తొలి నామినేషన్ ● ఇండియన్ షార్ట్ ఫిల్మ్‌కి నామినేషన్

97వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం ఈ ఏడాది మార్చి 2న లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఘనంగా జరగనుంది. కాగా ఈ అవార్డులకు సంబంధించిన నామినేషన్లను గురువారం రాత్రి (భారతీయ కాలమానం ప్రకారం) ప్రకటించారు. అమెరికన్ నటుడు బోవెన్ యాంగ్, నటి రాచెల్ సెన్నాట్‌లు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. అయితే ఈ నామినేషన్ల ప్రకటన ఈ నెల 17న జరగాల్సింది. కానీ అమెరికాలో చెలరేగిన కార్చిచ్చు కారణంగా 19కి వాయిదా వేశారు. ఫైనల్‌గా 23న ప్రకటించారు.

రికార్డ్ సాధించిన స్పానిష్ మ్యూజికల్ థ్రిల్లర్

ఈసారి స్పానిష్ మ్యూజికల్ థ్రిల్లర్ మూవీ 'ఎమిలియా పెరెజ్' నాన్–ఇంగ్లిష్ విభాగంలో 13 నామినేషన్లు దక్కించుకుని రికార్డ్ సాధించింది. గతంలో చైనా మూవీ 'క్రౌచింగ్ టైగర్ హిడెన్ డ్రాగన్', మెక్సికన్–అమెరికన్ డ్రామా 'రోమా'... ఈ రెండు చిత్రాలు నాన్–ఇంగ్లిష్ విభాగంలో పది నామినేషన్లు దక్కించుకున్నాయి. ఇప్పుడు 13 నామినేషన్లతో 'ఎమిలియా పెరెజ్' వాటిని అధిగమించింది. అలాగే ఈ చిత్రంలో ఓ లీడ్ రోల్‌లో నటించిన స్పానిష్ నటి కార్లా సోఫియా గాస్కాన్ (బెస్ట్ యాక్ట్రస్ లీడ్ రోల్ నామినేషన్) చరిత్ర సృష్టించారు. ఆస్కార్ అవార్డుకు నామినేట్ అయిన తొలి ట్రాన్స్‌జెండర్ నటిగా నిలిచారామె. ఇంకా 'ది బ్రూటలిస్ట్, విక్డ్' చిత్రాలకు పది నామినేషన్ల చొప్పున దక్కాయి. అంతగా అంచనాలు లేని 'కాన్‌క్లేవ్' మూవీకి 8 నామినేషన్లు దక్కడం ఓ విశేషం.

ఒక్క నామినేషన్ తేడాతో... నాన్ ఇంగ్లిష్ ఫిల్మ్ విభాగంలో 13 నామినేషన్లు దక్కించుకుని, రికార్డు సాధించిన 'ఎమిలియా పెరెజా'కి ఇంకో నామినేషన్ దక్కి ఉంటే... ఇంగ్లిష్ ఫిల్మ్‌ల రికార్డుని కూడా అధిగమించి ఉండేది. 'టైటానిక్, ఆల్ అబౌట్ ఈవ్, లా లా ల్యాండ్' వంటి ఇంగ్లిష్ చిత్రాలు 14 నామినేషన్లు దక్కించుకున్నాయి.



తల్లి హిస్టరీ రిపీట్: 'ఐయామ్ స్టిల్ హియర్' చిత్రానికి గాను ఫెర్నాండా టోర్రెస్ ఉత్తమ నటి విభాగంలో నామినేషన్ దక్కించుకున్నారు. ఇందులో విశేషం ఏంటంటే... ఆమె తల్లి ఫెర్నాండా మోంటెనెగ్రో 1991లో 'సెంట్రల్ స్టేషన్' చిత్రానికి గాను ఉత్తమ నటి విభాగంలో నామినేషన్ దక్కించుకున్న తొలి బ్రెజిలియన్ నటిగా రికార్డుని సాధించారు. ఇప్పుడు ఇన్నేళ్లకు మలి బ్రెజిలియన్ నటిగా టోర్రెస్ నామినేషన్ దక్కించుకుని తల్లి హిస్టరీని రిపీట్ చేశారు.

బరిలో ఇండియన్ షార్ట్ ఫిల్మ్: ఆడమ్ జే గ్రేవ్స్ దర్శకత్వం వహించిన 'అనూజ' బెస్ట్ షార్ట్ ఫిల్మ్ (లైవ్ యాక్షన్) విభాగంలో నామినేషన్ దక్కించుకుంది. ఆల్రెడీ రెండు ఆస్కార్ అవార్డులు సాధించిన భారతీయ నిర్మాత గునీత్ మోంగా ఈ చిత్రానికి ఓ నిర్మాత కావడం విశేషం. అలాగే నటి ప్రియాంకా చోప్రా ఓ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారు. ఢిల్లీలోని ఓ గార్మెంట్ ఫ్యాక్టరీలో పని చేసే తొమ్మిదేళ్ల అనూజ స్కూల్‌కు వెళ్లాలనుకుంటుంది. ఆ నిర్ణయం ఆమె జీవితాన్ని, అనూజ సోదరి పాలక్ భవిష్యత్‌ను ఏ విధంగా ప్రభావితం చేసింది? అనే కోణంలో ఈ చిత్రం సాగుతుంది. అనూజగా సజ్దా పఠాన్, పాలక్‌గా అనన్య షాన్‌భాగ్ నటించారు. ఇదిలా ఉంటే... గునీత్ మోంగా ఓ నిర్మాతగా వ్యవహరించిన 'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కి గాను బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో 2023లో ఆస్కార్ దక్కింది. అంతకుముందు 2021లో గునీత్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన 'పీరియడ్: ఎండ్ ఆఫ్ సెంటెన్స్'కిగాను బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో అవార్డు దక్కింది. ఇప్పుడు ఆమె ఓ నిర్మాతగా వ్యవహరించిన 'అనూజ'కు కూడా ఆస్కార్ దక్కుతుందా? అనేది చూడాలి.

భారతీయ సినిమాకి నిరాశ

ఆస్కార్ అవార్డ్స్ రిమైండర్ లిస్ట్‌లో నిలిచిన భారతీయ చిత్రాలు 'కంగువ, ఆడు జీవితం ('ది గోట్ లైఫ్), సంతోష్, స్వతంత్రవీర్ సవార్కర్, ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్, గర్ల్స్ విల్ బీ గర్ల్స్, పుతల్' ఆస్కార్ నామినేషన్‌ను దక్కించుకోలేకపోయాయి. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో నామినేషన్ కోసం ఈ ఏడాది ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పంపిన హిందీ చిత్రం 'లాపతా లేడీస్' ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లోనూ చోటు దక్కించుకోలేకపోయిన విషయం తెలిసిందే. ఇలా ఈసారి భారతీయ సినిమాకి నిరాశ ఎదురైంది.